Eenadu

# త్వరలో 20వేల ఉద్యోగాల భర్తీ

## ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో త్వరలో 20వేల ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. పిల్లలకు ఇప్పటికే నైపుణ్యాన్ని పెంచేందుకు అనువుగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కృష్ణా పుష్కరాల్లో భాగంగా బుధవారం విజయవాడ సమీపాన ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద ఏర్పాటు చేసిన హారతి కార్యక్రమం అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లల్ని చదివించకుంటే వారికి అన్యాయం, ద్రోహం చేసినట్లవుతుందని అన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో ఇ-క్లాస్ రూంలను పెట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను ప్రపంచంలోని విద్యా కేంద్రాలతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించేందుకు అనువుగా ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు బాగా చదువుకుంటే వారికి ఉద్యోగాలు సృష్టించే బాధ్యత తనదని స్పష్టం చేశారు. 2016-17లో వివిధ రంగాల్లో 2.50 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణను అందిస్తామని పేర్కొన్నారు. రెండేళ్లలో ఉపాధి అవకాశాలను 15 శాతం నుంచి 30 శాతానికి తీసుకెళ్తామని, ఐదేళ్లలో 60 శాతం పెరిగేలా లక్ష్య సాధన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ కృష్ణా పుష్కరాల నిర్వహణ అద్భుతంగా ఉందని ఇవి చరిత్రలో నిలుస్తాయని అన్నారు.